క్లుప్తంగా

గిరిజన కాలనీలో వైద్య శిబిరం

కోట: తిన్నెలపూడి లంక గిరిజన కాలనీలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మీ, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది కాలనీలో పర్యటించి ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్తహీనతను అరికట్టేందుకు మందులు వాడకంతో పాటు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. స్త్రీలలో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలు వివరించారు. గిరిజనులు తమ పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని సూచించారు.

బెంగళూరుకు ఆర్టీసీ బస్సులు ప్రారంభం

వెంకటగిరి(సైదాపురం):ఆర్టీసీ ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వెంకటగిరి ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం ఆర్టీసీ వెంకటగిరి–బెంగళూరుకు రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం వెంకటగిరి–చెన్నై బస్సు నడిపేందుకు కృషి చేస్తామన్నారు. డిపో మేనేజర్ రామకృష్ణ, డిపో కార్యదర్శి కేవీ రత్నం పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

సైదాపురం: జీవో నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని పూలే టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రత్నం, రాష్ట్ర అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు, కార్యదర్శి తుమ్మా రవి కోరారు. వారు బుధవారం పెరుమాళ్లపాడు, ఊటుకూరు, జోగిపల్లి, పొక్కందల, దాడిశెట్టిపల్లి, మొకలపూడి, రామసాగరం, తూర్పుపూండ్ల, సైదాపురం గ్రామాల్లోని పాఠశాలల్లో ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కాటబత్తిన సుబ్రమణ్యం, ఎస్‌భాస్కర్, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపాలిటీతో పాటు మండలంలో 9,223 మందికి సామాజిక పింఛను పంపిణీకి చర్యలు తీసుకున్నట్టు మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఆగస్టు నెలకు సంబంధించిన పింఛను మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులు గురువారం ఉదయం ఇంటింటికీ వెళ్లి అందజేస్తారని పేర్కొన్నారు. మొత్తం 170 మందికి పైగా సచివాలయ ఉద్యోగులు ఒక్కొక్కరు 50 మంది పింఛనుదారులకు నగదు ఇస్తారని వెల్లడించారు. నాయుడుపేట మున్సిపాలిటీలో 4,161 మందికి వివిధ రకాల పింఛన్లకు నగదు రూ.1,79,91,500లు, మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో 5,062 మందికి రూ.2,16,94,000 మంజూరైనట్టు తెలిపారు.

పోలేరమ్మ జాతర చాటింపు

నాగలాపురం: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం గ్రామదేవత పోలేరమ్మ జాతర చాటింపు వేశారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు గ్రామ పెద్దలు, మహిళలు ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అనంతరం సాయంత్రం 7 గంటలకు అమ్మవారికి చాటింపు వేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ పోలేరమ్మ జాతరను పురస్కరించుకుని 7వ తేదీ గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో పొంగళ్లు పెట్టి సాయంత్రం అత్యంత వైభవంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 8వ తేదీ గురువారం ఉదయం జాత్ర ముగుస్తుందన్నారు.

చికిత్స పొందుతూ కార్మికురాలి మృతి

ఏర్పేడు: మండలంలోని వికృతమాల టీసీఎల్‌లో పనిచేస్తున్న ఓ కార్మికురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్టు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం మేరకు.. మండలంలోని మునగలపాళెం గ్రామానికి చెందిన గౌతమి(45) వికృతమాల టీసీఎల్ కంపెనీలో కార్మికురాలిగా పనిచేస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి విధులు నిర్వహిస్తూ విషపు గుళికలు తిని ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. తోటి కార్మికులు గుర్తించి రేణిగుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది.

ఆగిన టూరిజం సముదాయం పనులు


నేలపట్టు పక్షుల కేంద్రం మార్గంలో శిథిలావస్థకు చేరుకున్న టూరిజం హోటల్ పైభాగం


డీవీ సత్రంలో నిరుపయోగంగా ఉన్న టూరిజం హోటల్

వివిధ దేశాల నుంచి పలు పక్షులు సంతానోత్పత్తి కోసం నేలపట్టు, పులికాట్ పక్షుల రక్షిత కేంద్రాలకు వస్తుంటాయి. గుడ్లు పెట్టి పొదిగి, పిల్లలను తీసుకుని తిరిగి తమ స్వస్థలాలకు చేరుకుంటాయి. కనువిందు చేసే ఆయా పక్షులను చూడడంతోపాటు పులికాట్ సరస్సు అందాలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. వారికి అనుకూలంగా ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో రూ.కోట్లు వెచ్చించి టూరిజం శాఖ ఆధ్వర్యంలో హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఉడెన్ కాటేజెస్, వాచ్ టవర్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రారంభం కాకుండానే భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. రూ.కోట్ల ప్రజా ధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. –దొరవారిసత్రం

- ప్రారంభంకాకనే శిథిలావస్థకు చేరుతున్న వైనం
- తడలో మూతపడిన టూరిజం హోటల్, గృహాలు
- బూడిదపాలైన రూ.కోట్ల ప్రజాధనం

ప్రపంచ దేశాల్లోనే విదేశీ వలస విహంగాలకు సంతానోత్పత్తి కేంద్రంగా నేలపట్టు, పులికాట్ సరస్సు ప్రసిద్ధి చెందాయి. ఇక్కడికి ప్రతి ఏటా పక్షులు వలస వచ్చి సంతానాన్ని ఉత్పత్తి చేసుకుని తిరిగి వెళతాయి. ఈ క్రమంలో వాటిని చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేలపట్టు పక్షుల కేంద్రానికి వెళ్లే మార్గంలో టూరిజం శాఖ ద్వారా టూరిజం హోటల్స్, షాపింగ్ కాంప్లెక్స్, ఉడెన్ కాటేజెస్ తదితరాలు నిర్మించాలని భావించాయి. ఇందులో భాగంగా స్వదేశీ సందర్శయాన్ పథకం(2017–18) కింద రూ.3.18 కోట్లతో వివిధ నిర్మాణాలను చేపట్టారు. అలాగే ఆరు ఉడెన్ కాటేజస్, అన్ని సదుపాయలతో రెస్టారెంట్, పక్షుల పండుగ సీజన్‌లో సందర్శకుల సౌకర్యార్థం పెద్ద వాచ్ టవర్‌ను నిర్మించారు. వాహనాలకు పార్కింగ్, అందరినీ ఆకట్టుకునేలా పుట్‌పాత్, సోలార్ లైట్లు, బెంచీలు, గ్రీన్ గార్డెన్ తదితరాలను ఏర్పాటుచేశారు. ఇందులో ఏ ఒక్కటీ వినియోగంలోకి రాకుండానే నిర్మాణాలన్నీ వదిలేయడంతో నిరుపయోగంగా మారి శిథలావస్థకు చేరాయి. అదేవిధంగా 2000–01 పీఆర్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.50 లక్షలు వెచ్చించి రెండు పెలికాన్ అతిథి గృహాలను నిర్మించారు. ఇవి కూడా వాడకంలోకి రాకనే శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాటిని కూడా టూరిజం శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని స్వదేశీ సందర్శయాన్ పథకం నిధులు రూ.20 లక్షలు వెచ్చించి నాలుగు సూట్ రూమ్‌లును సిద్ధం చేసింది. అలాగే డీవీ సత్రంలో 2001–02లో రూ.కోటితో టూరిజం హోటల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టారు. కొంత కాలం శాఖా పరంగా నడిపారు. తర్వాత ప్రైవేటు పరం చేయడంతో వారు సక్రమంగా నడపలేక వదిలేశారు. దీంతో అవి కూడా నిరుపయోగంగా మారి శిథిలాస్థకు చేరాయి.

తడలో జాతీయ రహదారికి ఆనుకుని..


నిరుపయోగంగా ఉన్న వాచ్ టవర్

తమిళనాడు–ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన తడలో జాతీయ రహదారికి ఆనుకుని 2002–03లో టూరిజం రెస్టారెంట్, అతిథి గృహాలను రూ.3 కోట్లు వెచ్చించి నిర్మించారు. వ్యాపారం జోరుగా సాగడంతో 2013లో ఇక్కడే సుమారు రూ.4 కోట్లు వెచ్చించి 14 గృహాలను నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రెండేళ్ల క్రితం మూతపడ్డాయి. తర్వాత వాటిని ప్రైవేటు వారికి అప్పగించినా ఫలితం లేదు.

అందుబాటులోకి తేవాలి



దొరవారిసత్రం, నేలపట్టు పక్షుల కేంద్రానికి వెళ్లే మార్గంలో ఉన్న టూరిజం హోటళ్లు, కాటేజెస్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. అవి సందర్శకులతో పాటు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అతిథి గృహాలను కూడా వినియోగంలోకి తీసుకువస్తే సందర్శకులకు అనుకూలంగా ఉంటాయి.
–యూ.బాబు, వీఎంఆర్ నగర్, డీవీ సత్రం

పక్షుల సీజన్‌లో పర్యాటలకు సౌకర్యం



అతిథి గృహాలు, హోటళ్లు వినియోగంలోకి వస్తే పక్షుల సీజన్‌లో పర్యాటకులకు అనుకూలంగా ఉంటుంది. బయటి ప్రాంతాల నుంచి కేంద్రానికి వచ్చేవారికి స్థానికంగా మంచి వసతి, హోటల్ వంటి సదుపాయాలు లేకపోవడంతో సూళ్లూరుపేట, నాయుడుపేటకు పరుగులు తీయాల్సివస్తుంది.
–రామయ్య, సర్పంచ్, నేలపట్టు పంచాయతీ

అన్నీ ప్రైవేటు వారికి అప్పగించాము

దొరవారిసత్రం, తడ ప్రాంతాల్లోని టూరిజం సముదాయాలు అన్నింటినీ ప్రైవేటు వారికి అప్పగించాం. వాటిని ప్రారంభించేందుకు అన్ని పనులనూ సంబంధిత కాంట్రాక్టర్లు చేస్తున్నారు. త్వరలోనే టూరిజం హోటళ్లు, వసతి గృహాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం.
–శ్రీనివాసరావు, డీఎం, టూరిజంశాఖ

వైభవంగా సుబ్రమణ్య స్వామికి ఏకాంత సేవ


ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి

నాయుడుపేట టౌన్: పట్టణంలోని శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఏకాంత సేవను ఘనంగా నిర్వహించారు. దీంతో ఆడికృత్తిక వేడుకలు ముగిశాయి. ఇందులో భాగంగా స్వామిని చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. ఏకాంత సేవ అనంతరం పలువురు దంపతులకు తాంబుళం అందజేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, ఆలయ గౌరవాధ్యక్షుడు చదలవాడ రవికుమార్ శర్మ, అధ్యక్షుడు గణేష్ శర్మ, ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

ఆడపిల్లల చదువుతోనే సమాజాభివృద్ధి

సైదాపురం: ఆడపిల్లలు చదువుకుంటేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని రాపూరు ప్రాజెక్ట్ సీడీపీవో సునంద తెలిపారు. సైదాపురంలోని పాదుపు కార్యాలయంలో బుధవారం బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. అదే విధంగా గుడ్ టచ్– బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీఎం రాధ, ఏవో శివకుమార్, వైద్యాధికారి జనార్ధన్‌రావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఎఫ్‌ఏలపై రాజకీయ కుట్ర

- తప్పిదం లేకుండానే నలుగురు ఎఫ్‌ఏల తొలగింపు

పెళ్లకూరు: టీడీపీ అధికారంలోకి రాగానే రాజకీయ కుట్రలో భాగంగా ఎలాంటి తప్పిదం లేని నలుగురు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించి కొత్తవారిని నియమించడంపై మండలంలో సర్వత్రా విమర్శలు గుప్పుమంటున్నాయి. ముఖ్యంగా చింతపూడి, పుల్లూరు, చెన్నప్పనాయుడుపేట, నందిమాల గ్రామాలకు చెందిన ఉపాధిహామీ క్షేత్ర సహాయకులను ఆ శాఖ ఏపీవో దయానంద్ తొలగించి కొత్తవారిని నియమించారు. ఆయా గ్రామాల్లోని కొందరు టీడీపీ నాయకుల ఒత్తిడితో చాలా కాలంగా పనిచేస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కొత్తవారికి లాగిన్ ఇచ్చారు. ఏపీవో అత్యుత్సాహంతోనే ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించినట్లు తెలుస్తోంది. ఎన్నికల వరకే రాజకీయం చేయాలని, ఇలా రాజకీయ కక్ష సాధింపు చర్యలు తగదని స్థానికులు చెబుతున్నారు.

టీడీపీలో వర్గవిభేదాల వల్లే ఎఫ్‌ఏల తొలగింపు?

మండలంలోని చింతపూడిలో చాలా కాలంగా ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిగా రాంబాబు పనిచేస్తున్నారు. అతన్ని ఏపీవో తొలగించారు. గ్రామంలో నెలకున్న టీడీపీ వర్గపోరులో భాగంగానే అతన్ని తొలగించారనే ప్రచారం జరుగుతోంది. టీడీపీకి చెందిన స్థానిక సర్పంచ్ వర్గానికి, అదే పార్టీకి చెందిన దళిత నాయకుడికి మధ్య వర్గపోరు కొనసాగుతుంది. ఎఫ్‌ఏ రాంబాబును తొలగించేలా స్థానిక దళిత నాయకుడు అధికారులపై ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో కొత్త వారిని నియమించి లాగిన్ ఇవ్వడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపుపై ఇన్‌చార్జి ఎంపీడీవో అన్నపూర్ణారావును వివరణ కోరగా మేట్లకు మాత్రమే లాగిన్ ఇస్తున్నట్లు తెలిపారు. నోటీసులు జారీ చేయకుండా ఎఫ్‌ఏలను తొలగించడం లేదన్నారు. ఇబ్బడిముబ్బడిగా మేట్లకు లాగిన్ ఇవ్వవద్దని డ్వామా పీడీ కూడా సూచించారని తెలిపారు.

రాజకీయ కక్ష సాధింపులతో ప్రహరీ గోడ కూల్చివేత


సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

రాపూరు: 45 ఏళ్లుగా తాము పశువుల పాకగా వినియోగించుకుంటున్న స్థలం చుట్టూ ఉన్న ప్రహరీ గోడను రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా తొలగించడం దారుణమని సిద్దవరం గ్రామానికి చెందిన కోటంరెడ్డి రవికుమార్‌రెడ్డి, మొరంరెడ్డి రామిరెడ్డి, గుణభూషణమ్మ, పోలంరెడ్డి శివరామయ్య, బండి శారదమ్మ, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి వాపోయారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. దుతూ తమ ఇంటి సమీపంలో ఉన్న స్థలంలో 45 ఏళ్లుగా పశువుల పాక ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. అక్కడ గడ్డివామి వేసుకోవడంతోపాటు పశువులను కట్టేసుకుంటున్నామని తెలిపారు. ఈ క్రమంలో పశువులను రక్షించుకునేందుకు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకున్నామని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీన జరిగిన గ్రామసభలో కూడా అధికారులు స్థలాన్ని పరిశీలించి తాము వినియోగించుకునేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారని తెలిపారు. తాము వైఎస్సార్ సీపీ సానుభూతి పరులమని పేర్కొంటూ కొందరు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శిపై ఒత్తిడి తీసుకువచ్చి పోలీసుల సహకారంతో జేసీబీ సహాయంతో ప్రహరీ గోడను కూల్చివేశారని, పేడ దిబ్బలను చదును చేశారని వాపోయారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి


మాట్లాడుతున్న డీటీ ఓబయ్య

పెళ్లకూరు: తెల్లరేషన్ కార్డుదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సివిల్ సప్లయి డీటీ ఓబయ్య ఆదేశించారు. ఆయన బుధవారం డీలర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కొలతలు, తూకాల్లో వ్యత్యాసం రాకుండా చూడాలని పేర్కొన్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉండి సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం


హెల్మెట్ లేని ప్రయాణికులకు సూచనలు ఇస్తున్న సీఐ, ఎస్‌ఐ

గూడూరు రూరల్: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదకరమని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌తో కలిసి జాతీయ రహదారిలోని పోటుపాళెం కూడలి ప్రాంతంలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

విద్యార్థులకు కంటి, దంత పరీక్షలు


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

వెంకటగిరి రూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం సింహపురి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటగిరికి చెందిన ప్రముఖ వైద్యులు సుమన్ చల్లా, ఎస్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు కావ్య కంటి, దంత పరీక్షలు చేశారు. వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులు రోజూ రెండు పూటలా విధిగా దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. కళ్ల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పేస్టులు, బ్రష్‌లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాహనాభాను, సంస్థ అధ్యక్షుడు గుడిమెట్ల ఉదయ్‌కుమార్, కార్యదర్శి పోచినేని ప్రవీణ్ కుమార్, విష్ణు, వర్ధన్, సాయినికేష్, సాయి చరణ్ వైద్యులు గిరిజ, లీలాకృష్ణ పాల్గొన్నారు.

సైదాపురం పీహెచ్‌సీపై సమగ్ర విచారణ


విచారణ చేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణితో మాట్లాడుతున్న స్థానికులు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని పీహెచ్‌సీ కొంత కాలం నుంచి వైద్యాధికారులు, సిబ్బంది మధ్య నెలకొన్న వివాదం తారాస్థాయికి చేరింది. ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు వైద్యాధికారులు, సిబ్బంది మధ్య జరిగిన వివాదంపై చర్చించారు. రాత పూర్వకంగా తమ సమస్యలను వివరించాలని ఆమె ఆదేశించారు. నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. పలువురు గ్రామ ప్రజలు అక్కడికి చేరుకుని ఆమెతో మాట్లాడారు. 104లో పనిచేస్తున్న ఒక యువకుడిపై తప్పుడు ఆరోపణలు చేయడంతో అతను రాజీనామా చేశాడని, న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఉమామహేశ్వరి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించం

- ఎక్స్‌అఫియో సభ్యుడిగా ఎమ్మెల్యే కురుగొండ్ల ప్రమాణం.
- కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై గలమెత్తిన కౌన్సిలర్లు


సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి మున్సిపాలిటీలో అక్రమ కట్టాడాలు, ఆక్రమణలపై ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతను కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎక్స్ అఫియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో పలు చోట్ల రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని తొలగించాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి పట్టణానికి తాగు నీరు సరఫరా చేసేందుకు ప్రత్యేక పైపులైన్‌ల కోసం రూ.93 కోట్లు, పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాల నిర్మాణానికి రూ.11 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. టిడ్కో ఇళ్ల ముందు నిర్మించిన ఇళ్లను తొలగిస్తామన్నారు. అనంతరం అజెండాలోని అన్నీ అంశాలను ఆమోదించారు. పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద తమ సొంత నిధులతో వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ ప్రతిమ కూడిన ఆర్చి నిర్మిస్తామని, అదే విధంగా పాలకేంద్రం సెంటర్ వద్ద కోనా వెంకటేశ్వరరావు, సర్వేపల్లి విజయశేఖర్ దాతృత్వంతో పోలేరమ్మ ఆర్చిని నిర్మించేందుకు తీర్మానం చేశారు. 5వ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్, వైస్ చైర్మన్ సేత రాసి బాలయ్య మాట్లాడుతూ అజెండాలో ఆమోదం తెలిపిన బిల్లులను మినిట్స్‌బుక్‌లో నమోదు చేయకపోవడంపై ప్రశ్నించారు. 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య, 21వ వార్డు కౌన్సిలర్ ఢిల్లీబాబు, కమిషనర్ అబ్దుల్‌షరీద్ తదితరులు పాల్గొన్నారు.

సేద తీరలేని అతిథులు

ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఉండడానికి గూడూరులో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల ఆధ్వర్యంలో రెండు అతిథి గృహాలు నిర్మించాయి. వాటి నిర్వహణ గురించి అధికారులు పట్టించుకోలేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వేర్వేరు పనుల నిమిత్తం గూడూరుకు వచ్చే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రస్తుతం లాడ్జీల్లో గదులు అద్దెకు తీసుకుని బస చేయాల్సి వస్తోంది. పట్టణ నడిబొడ్డున విలువైన స్థలంలో భవనాలున్నా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. –చిల్లకూరు

- శిథిలావస్థలో రెండు గెస్ట్ హౌస్‌లు
- పట్టించుకోని అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



శిథిలావస్థలో ఉన్న పంచాయతీ రాజ్ శాఖ గెస్ట్ హౌస్, ముళ్లపొదల్లో ఉన్న ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్

చెన్నై, నెల్లూరు, తిరుమలకు వెళ్లే అధికారులు, ప్రజా ప్రతినిధులు గూడూరులో దిగి కొంత సేపు సేద తీరుతూ ఉంటారు. వారి కోసమని గతంలో గూడూరు పట్టణ నడిబొడ్డున ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో 50 ఏళ్ల క్రితం ఒక గెస్ట్ హౌస్, 1986లో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఒక గెస్ట్ హౌస్ నిర్మించారు. ఇవి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు దగ్గరగా ఉండడం, సమీపంలోనే రైల్వే స్టేషన్ ఉండడంతో తనిఖీలకు వచ్చిన అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు ఈ గృహాల్లో బస చేసేవారు. తర్వాతి కాలంలో వాటి గురించి పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. పదేళ్ల క్రితం పంచాయతీ రాజ్ అతిథి గృహాలను జిల్లా పరిషత్‌కు అనుసంధానం చేసి మరమ్మతులు చేయడంతో పాటు వాటిని సక్రమంగా వినియోగించాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. గూడూరులోని పంచాయతీ రాజ్ అతిథి గృహం ఎక్కువ కాలం దివంగత ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఉండేది. ఆ సమయంలో దాన్ని సుందరంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. వీఐపీలు వచ్చిన సమయంలో ఆ గృహంలో బస చేసేవారు. ఆయన మరణానంతరం ఆ అతిథి గృహాన్ని ఎవరూ వినియోగించలేదు. దానిపై అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడింది. దీంతో అతిథి భవనం పూర్తిగా ముళ్ల చెట్లతో నిండిపోయింది. భవనం పైకప్పు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. అదేవిధంగా రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహానికి అప్పడప్పుడూ మరమ్మతులు చేసి అధికారులు, ప్రజా ప్రతినిధుల బస కోసం వినియోగించే వారు. ఐదేళ్ల క్రితం ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అతిథి గృహం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తమ ఆధీనంలోని స్థలంలో అనుమతులు లేకుండా భవన నిర్మాణానికి ఎలా పూనుకుంటారని ఆర్అండ్‌బీ శాఖ అధికారులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు దానిపై స్టే ఇవ్వడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిపి వేశారు. అతిథి గృహం భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వినియోగంలో లేకుండా పోయింది.

పరిశీలన చేసేలా చర్యలు తీసుకుంటాం

గూడూరులోని పంచాయతీ రాజ్ అతిథి గృహంపై పర్యవేక్షణ పూర్తిగా జిల్లా పరిషత్ ఆధీనంలోనే ఉంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం గూడూరు ఎంపీడీవోకు బాధ్యత అప్పగించి అక్కడ పర్యవేక్షణ చేసేలా చూస్తాం.
– చిరంజీవి, జెడ్పీ సీఈవో, నెల్లూరు

పూర్తిగా తొలగించాల్సి ఉంది

ఆర్అండ్‌బీ అతిథి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఆవరణలో పోలీసులు నిర్మించే భవన విషయం కూడా కోర్టులో ఉన్నందున ప్రస్తుతం అతిథి భవనంపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక పంపి భవన నిర్మాణాన్ని చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.
– రామాంజనేయులు, ఆర్అండ్ బీ ఈఈ, గూడూరు

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: సీతారాంపేట వద్ద బుధవారం బైక్ అదుపుతప్పి తిరుపతికి చెందిన సుబ్బరాయులు, వెంకటేశ్వర్లు గాయపడ్డారు. వారు శ్రీకాళహస్తి వెళుతున్నారు. ముందు వెళ్లే వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి కింద పడ్డారు.